
క్లుప్తంగా

దివ్య అక్షతలతో శోభాయాత్ర

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో శుక్రవారం శ్రీరామచంద్రుని దివ్య అక్షతలతో రామాలయ కమిటీ సభ్యులు శోభాయాత్ర నిర్వహించారు. మండల సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ నుంచి వచ్చిన అక్షతలను తలపై పెట్టుకుని గ్రామంలో ఈ కార్యక్రమం జరిపారు. ఫౌండేషన్ కన్వీనర్ అద్దె మల్లేశ్వరరావు, మండల మహిళా కన్వీనర్ కొణపల అభిలాష మాట్లాడుతూ అయోధ్య నుంచి వచ్చిన స్వామివారి అక్షతలను గ్రామంలో ఊరేగించి, రామాలయానికి తీసుకువచ్చామని, అక్కడ భక్తులు శ్రీరామనామ జపం పఠించారని తెలిపారు. వచ్చే నెల ఒకటి నుంచి 7 వరకూ ప్రతి ఇంటికి దివ్య అక్షతల వితరణ జరపుతామన్నారు.

ఘనంగా లక్ష తులసీ పూజ


బిక్కవోలులో లక్ష్మీనారాయణ స్వామివారు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో ఉన్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయం వద్ద శుక్రవారం స్వామివారికి లక్ష తులసి పూజ జరిగింది. అర్చకులు బిక్కవోలు హర్షవర్ధన్, బిక్కవోలు రాఘవరాం, వాడపల్లి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు, హోమాలు, తులసి పూజ, ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం గ్రామానికి చెందిన సత్తి గంగిరెడ్డి తన జన్మదినం సందర్భంగా పేదలకు చీరలకు పంపిణీ చేశారు. శుక్రవారం తన 75వ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేసినట్టు తెలిపారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

సీతానగరం: మండలంలోని గ్రామ పంచాయతీలు అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాల్సి ఉందని ఈవోపీఆర్డీ మూర్తి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 2024 – 25కు గాను గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికను ప్రతి పంచాయతీ వచ్చే నెలలో సిద్ధం చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు ప్రతి పంచాయతీ వద్ద గ్రామ సభలు నిర్వహించి, ప్రణాళిక రూపొందిస్తారనన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు.

కుటుంబ సభ్యులకు తప్పిపోయిన బాలుడి అప్పగింత


బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై శివనాగబాబు

గోకవరం: తప్పిపోయి పోలీసులు సంరక్షణలో ఉన్న ఏడేళ్ల బాలుడిని శుక్రవారం గోకవరం పోలీసులు బాలుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్సై యు.వి.శివనాగబాబు తెలిపారు. ప్రకాశం జిల్లా నుంచి కొందరు వ్యక్తులు దేవీపట్నం మండలం పోతవరం గ్రామానికి పని నిమిత్తం వచ్చారు. వీరికి చెందిన ఏడేళ్ల బాలుడు రాగి శ్రీకాంత్ తన అక్కపై కోపగించి సైకిల్ తొక్కుతూ గోకవరం మండలం సింగారమ్మచింత వద్దకు చేరుకున్నాడు. దిక్కుతోచని స్థితిలో ఉన్న కొందరు వ్యక్తులు బాలుడిని గుర్తించి పోలీసులకు అప్పగించగా సంరక్షించి వసతి గృహంలో ఉంచారు. శుక్రవారం సోషల్ మీడియా ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు రావడంతో బాలుడిని అప్పగించారు.

వ్యవసాయ క్షేత్రాల సందర్శన


కేవీకేలో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన రైతులు

రాజానగరం: ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, సాగులో ఖర్చులను తగ్గించడంతో పాటు ఆరోగ్యకర పంటలను పండించవచ్చని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 70 మంది రైతులు శుక్రవారం కేవీకేలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, అక్కడ జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు వారికి ప్రకృతి వ్యవసాయంలో అనుసరించాల్సిన పద్ధతులు, పెరటి తోటల పెంపకం, వాటివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అరటి తోటలలో అంతర్ పంటలుగా పసుపు, ఆకుకూరలు, కోళ్ల, మేకల పెంపకం గురించి తెలియజేశారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సందర్శకులకు వంగ, టమాటా, పచ్చిమిర్చి నారును ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సీటీఆర్ఐ శాస్త్రవేత్త ఎస్.రామకృష్ణ, ఏపీసీఎన్ఎఫ్ ప్రతినిధులు సీహెచ్.వరలక్ష్మి, సతీష్, కేవీకే వాతావరణ విభాగం ఇన్‌చార్జి దిలీప్, ఎంఏ రాజు, టి.విజయవర్ధన్, ప్రభాత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సందడికి రెడీ


నూతన సంవత్సర వేడుకలకు సిద్ధమైన కేకులు

- న్యూఇయర్ ఈవెంట్లకు ముమ్మర ఏర్పాట్లు
- మార్కెట్లలో పండ్లు, బొకేలకు పెరిగిన డిమాండ్
- ప్రతి వేడుకలోనూ భాగమైన కేకులు
- అభిరుచులకు తగ్గట్టుగా తయారు చేస్తున్న వ్యాపారులు

బిక్కవోలు: నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అన్ని వర్గాల ప్రజలు ముందుస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వేడుకల్లో భాగంగా పూలకు మంచి డిమాండ్ ఏర్పడింది. శుభాకాంక్షలు తెలిపేందుకు రకరకాల డిజైన్లతో బొకేలు మార్కెట్లో ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. ఒకప్పుడు కుటుంబ సభ్యులు ఏదైనా వేడుక జరుపుకోవాలంటే రకరకాల పిండి వంటలు తయారు చేసుకునేవారు. కానీ ప్రస్తుతం ట్రెండ్ మారింది. ఇప్పుడు వేడుక ఏదైనా కేక్ ఉండాల్సిందే అన్నట్టుగా పరిస్థితి మారింది. కేక్ కటింగ్ అంటే గతంలో బర్త్‌డే పార్టీలకు, న్యూ ఇయర్ వేడుకలకే పరిమితమయ్యేది. ఇప్పుడు వివాహ వేడుకల్లోనూ వధూవరులతో కేక్ కట్ చేయించే సంప్రదాయం మొదలైంది. పెద్ద చిన్నా అనే వయస్సు తేడా లేకుండా పెళ్లి రోజులకూ కేక్ కట్ చేస్తున్నారు. దీంతో కేక్ తయారీదారులకు కొత్త తరహా కేకులు తయారుచేయడం సవాలుగా మారింది. అన్నింటికీ ఒకేలా కేక్ తయారు చేసే పద్ధతికి వారు చరమగీతం పాడారు. వివిధ ఆకారాల్లో.. సృజనాత్మకతకు పదునుపెట్టి కేకులు తయారు చేస్తున్నారు. ఇప్పుడు న్యూయర్ సందర్భంగా వివిధ రకాల ఆకృతుల్లో కేకులను తయారు చేసి విక్రయిస్తున్నారు. వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగా, వారికి కావాల్సిన ఆకృతుల్లో కేకులను బేకరీల నిర్వాహకులు తయారు చేసి ఇస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31 ఆదివారం కావడంతో నెల రోజుల ముందుగానే కేకులకు ఆర్డర్లు వచ్చాయి. కొంతమంది కోసం ఎగ్‌లెస్ కేకులూ అందుబాటులో ఉన్నాయని తయారీదారులు చెబుతున్నారు. రూ.250 నుంచి రూ.వెయ్యికి పైగా కేకులు అందుబాటు ఉన్నాయి. ఇప్పటికే అనపర్తి నియోజకవర్గంలో ఉన్న దుకాణాల్లో మొత్తం 6 వేల కేజీలకు పైగా కేకులు తయారుచేసి ఉంచారు.

రుచిలోనూ మేటి

కేకులు ఇప్పుడు రుచిలోనూ మేటిగా మారాయి. వెనిలా, బటర్‌స్కాచ్, పైనాపిల్, కస్టర్డ్ ఆపిల్ తదితర ఫ్లేవర్లలో కేకులు వినియోగదారులను నోరూరిస్తున్నాయి. ఇప్పుడు ఎక్కువగా కూల్ కేకులు అందుబాటులోకి వచ్చి, వినియోగదారుల చేత ఆహా అనిపిస్తున్నాయి.

ట్రెండ్ మారింది



ఇప్పుడు ప్రతి వేడుకలకూ కేక్ కట్ చేయడం ట్రెండ్‌గా మారింది. గతంలో పోల్చుకుంటే ప్రజల అభిరుచులు మారాయి. వారి ఇష్టానికి తగ్గట్టే కేకులను తయారు చేసి అందుబాటులో ఉంచుతున్నాం. ఇప్పటికే మాకు 400 కేకులకు ఆర్డర్ వచ్చింది. ఎగ్‌లెస్ కేకులు ఈ ఏడాది తక్కువగా ఆర్డర్ వచ్చాయి, ఇంకా ఆర్డర్ పెరిగినా తయారు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– రవికుమార్, శ్రీమంజునాథ బేకరీ యాజమాని, కొమరిపాలెం

సీఎం జగన్‌తోనే పేదలకు సొంతిల్లు


చింతపల్లిలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- మహిళలకు ఇళ్ల పట్టాల పంపిణీ

పెదపూడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సొంతింటి కల సాకారమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గండ్రేడు, చింతపల్లి, అచ్యుతాపురత్రయం గ్రామాల్లో ఎమ్మెల్యే 125 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, గండ్రేడులో రూ.55 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి పేదవాడు సొంతిల్లు నిర్మించుకుని ఆనందంగా జీవించాలనే ఉద్దేశంతో 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారన్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం దేశ చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా అనేక చారిత్రాత్మక సంక్షేమ పథకాలనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని వివరించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిరతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా జగనే కావాలంటూ కోరుతున్నారన్నారు. ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. భారీగా బాణసంచా కాల్చి, తీన్మార్ డప్పులతో పూలవర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచ్‌లు కుడుపూడి మాధవీలత, కొల్లు లోవకుమారి, అడబాల అనురాధ, ఎంపీటీసీలు సుందరపల్లి సుధాకర్, జీఎస్ కుమార్, పి.జ్ఞాన ప్రసూన, అచ్యుతాపురత్రయం పీఏసీఎస్ ఛైర్మన్ గుండా ఈశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శ


కాలిపోయిన షెడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలో మెకానిక్ షెడ్డు యజమాని కనుబొజ్జి సూర్యచంద్రాన్ని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా శుక్రవారం పరామర్శించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం మధ్యాహ్నం ఆ మెకానిక్ షెడ్డు కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఈ మేరకు ఆ షెడ్డును ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరిశీలించారు. మండల అధికారులతో మాట్లాడి బాధితుడికి సహకారాన్ని అందించాలన్నారు. ఆయన వెంట కాపవరం సర్పంచ్ జాజుల రాము, వైఎస్సార్ సీపీ నాయకులు నీరుకొండ బాబ్జీ తదితరులు ఉన్నారు.

పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గోకవరంలో 30 పడకల నూతన ప్రభుత్వాస్పత్రి భవనం ప్రారంభం


గోకవరంలో 30 పడకల ప్రభుత్వాస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేసిందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరంలో రూ.5.65 కోట్లతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 30 పడకల భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీకి ముఖద్వారంగా ఉన్నందున నూతన భవనానికి ప్రాధాన్యం ఇచ్చామన్నారు. నూతన భవనం కావాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అడిగిన వెంటనే అనుమతులు మంజూరు చేశారన్నారు. త్వరలో 50 పడకల ఆస్పత్రి కావడానికి కృషి చేస్తానన్నారు. దీనిలో భాగంగా పనులు నాణ్యతాపరంగా, త్వరితగతిన పూర్తి చేసిన కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, సొసైటీ మాజీ ఛైర్మన్ దాసరి తమ్మన్నదొర, సర్పంచ్ కొమరం శ్రావణి, మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కర్రి సూరారెడ్డి, పెనుగొండ సత్యానందం, తుర్రం సత్యవతి, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వనజ, ఇతర వైద్య సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు కనకదుర్గమ్మ తీర్థమహోత్సవం


సూర్యారావుపేటలో కొలువైన కనకదుర్గమ్మ

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకుని సూర్యారావుపేట జంక్షన్ వద్ద కొలువైన కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఆదివారం 43వ తీర్థమహోత్సవం జరగనుంది. అదేరోజు ఉదయం గండేపల్లి మండలం మురారిలో కూడా దుర్గమ్మ తీర్థం నిర్వహిస్తారు. వివిధ గ్రామాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా రానున్నారు. ఈ నేపథ్యంలో ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తారు. సూర్యారావుపేట, చక్రద్వారబంధం గ్రామస్తులు సంయుక్తంగా నిర్వహించే ఈ తీర్థ మహోత్సవాలను వైభవంగా జరిపేందుకు విస్తృతమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే మండలంలోని పాత తుంగపాడులో కూడా కనకదుర్గమ్మ తీర్థమహోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు.

కష్టపడి చదవడమే సీఎంకు రిటర్న్ గిఫ్ట్

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


ఇలపల్లిలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరడమే సీఎంకు ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇలపల్లి ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ విద్యార్థులకు ఇలా ట్యాబ్‌లు పంపిణీ చేయలేదన్నారు. విద్యార్థులు కింద స్థాయి నుంచే సాంకేతికతపై పట్టు సాధించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముందుచూపుతో ట్యాబ్‌లను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ స్థాయీ సంఘం ఛైర్మన్ రొంగల పద్మావతి, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, ఇలపల్లి సర్పంచ్ లొల్లం భద్రం, ఎంపీటీసీ సువర్ణలత, సొసైటీ డైరెక్టర్ సాధనాల రాంబాబు, రంగాపురం సర్పంచ్ గండికోట వీరభద్రరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, ఎంఈఓ సీహెచ్ సత్యనారాయణ, హెచ్‌ఎం పప్పు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతిదూత ఏసుక్రీస్తు


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న జక్కంపూడి గణేష్

రాజానగరం: ప్రపంచ శాంతి దూత ఏసుక్రీస్తు అని, ఆయన బోధనలు ఆచరణీయమని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. మండలంలోని సంపత్‌నగరంలో గురువారం రాత్రి నిర్వహించిన క్రిస్మస్ ఆరాధనలో ఆయన పాల్గొన్నారు. ఆపోస్తలిక్ మిరాకిల్ వర్షిప్ సెంటర్‌లో వై.యాపెత్ పాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటగట్ల రామకృష్ణ, అడ్వకేట్ ఆరుగొలను మహేష్ కుమార్, రిబ్కా, మెతుషెలా, షారోన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు


చినకొండేపూడిలో వాలీబాల్ క్రీడాకారులతో వైఎస్సార్ సీపీ నాయకులు


గాదరాడలో జరుగుతున్న వాలీబాల్ పోటీలు

సీతానగరం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో శుక్రవారం చినకొండేపూడి అంబేడ్కర్ నగర్‌లోని క్రీడా మైదానంలో వాలీబాల్ పోటీలను సర్పంచ్ చెరుకూరి పాల్ శ్రీనివాస్ ప్రారంభించారు. నాలుగు టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యవాణి, వైఎస్సార్ సీపీ నాయకులు ముదునూరి రామకృష్ణంరాజు, యర్రంశెట్టి బాబులు, వడ్లమూరి దివాకర్ రాజు, ఎస్. రామకృష్ణ పాల్గొన్నారు.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు కోరుకొండ మండలంలో ఉత్సాహంగా జరుగుతున్నాయి. గాదరాడ-2 సచివాలయం పరిధిలో బాలికల వాలీబాల్ పోటీలు నువ్వానేనా అన్నట్టు జరిగాయి. మండల కేంద్రమైన కోరుకొండలో బాలురకు ఖోఖో పోటీలు నిర్వహించారు.

టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీలు


బిక్కవోలులో తనిఖీ చేసిన వైద్య, ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ సభ్యులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న బిక్కవోలు సచివాలయం-4, కొంకుదురు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న పందలపాక సచివాలయం -2ను వైద్య, ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. శుక్రవారం డీఎంఓ డా.అభిషేక్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా గణాంక అధికారి కుమారస్వామి, డీపీహెచ్ఎన్ఓ వసంతలక్ష్మి, డీపీఓ సంధ్యారెడ్డి, డేటా మేనేజర్ రామకృష్ణతో కూడిన బృందం తనిఖీ చేశారు. సచివాలయం పరిధిలో ఉన్న గర్భిణుల ఎంసీపీ కార్డులు, చిన్న పిల్లలకు టీకాల నమోదు రికార్డులను పరిశీలించారు. 19 ఏళ్లలోపు పిల్లలకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి, పాత రికార్డులతో సరిపోల్చి సంతృప్తి వ్యక్తం చేశారు. పందలపాకలో గర్భిణులు, బాలింతలు 30 మంది రికార్డులు సక్రమంగా ఉన్నాయా, లేదా అని స్వయంగా నిర్ధారణ చేశారు. బిక్కవోలులో 16 మందిని పరీక్ష చేశారు. ఈ బృందానికి కొంకుదురు పీహెచ్‌సీ విజయలక్ష్మి, బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యురాలు దుర్గాదేవి, డాక్టర్ రుమన్ సహకరించారు.

వ్యభిచారం కేసులో వ్యక్తికి నాలుగేళ్ల జైలుశిక్ష

రాజమహేంద్రవరం రూరల్: వ్యభిచారం కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు (కఠిన కారాగార శిక్ష), రూ.2 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిషోర్ కుమార్, బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ విజయ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. 2019 జూన్ 8వ తేదీన పిడింగొయ్యి పంచాయతీ పరిధి అగ్రిగోల్డ్ లేఅవుట్‌లోని ఒక ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు అప్పటి బొమ్మూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.దామోదరరావు, ఎస్సై కె.జగన్‌మోహనరావు, సిబ్బందితో కలిసి దాడి చేశారు. సీతానగరం మండలం మునికూడలి గ్రామానికి చెందిన కొడమంచిలి యాకోబు, ద్వారంపూడికి చెందిన మాడెం దొరబాబు, ఒక మహిళ పట్టుబడ్డారు. మహిళను వారి బంధువులకు అప్పగించి, కొడమంచిలి యాకోబు, మాడేం దొరబాబుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. సదరు కేసు విచారణలో కొడమంచిలి యాకోబుపై నేరం రుజువు కావడంతో అతనికి నాలుగేళ్ల జైలుశిక్ష(కఠిన కారాగార శిక్ష), రూ.2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ తీర్పుఇచ్చారు. మాడెం దొరబాబుపై నేరం రుజువు కాకపోవడంతో అతడిపై కేసు కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోడి సతీష్ నాయుడు వాదనలు వినిపించారు.

నీరు పుష్కలం.. సాగు సంబరం


పురుషోత్తపట్నంలోని తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి విడుదల చేస్తున్న సాగునీరు

- రబీకి సమృద్ధిగా సాగునీరు
- అన్నదాతల హర్షాతిరేకాలు

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ ద్వారా రబీ పంటలకు సాగునీటిని పుష్కలంగా అందిస్తున్నారు. మండలంలో 15,500 ఎకరాల ఆయకట్టుకు రబీలో ఆరుతడి పంటలకు నీరందిస్తోంది. ఈ స్కీమ్‌ను ప్రధాన కాలువ పొడవు 3.925 కిలోమీటర్లు ఉండగా అక్కడ నుంచి ఎడమ కాలువ పొడవు 22 కిలోమీటర్లు, కుడి కాలువ 17 కిలోమీటర్లు ఉంది. పురుషోత్తపట్నం నుంచి బొబ్బిల్లంక వరకూ 15,500 ఎకరాలకు టీపీ స్కీమ్ ద్వారా నీరు అందుతోంది.

ఎమ్మెల్యే రాజా చొరవతో..

స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో నెల రోజుల ముందుగానే సాగునీరు అందుతోంది. టీడీపీ ప్రభుత్వంలో రెండోపంటకు నీరు అందించడానికి రైతుల నుంచి నగదు వసూలు చేసేవారు. అయినా సక్రమంగా నీరు ఇచ్చేవారు కాదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఖరీఫ్‌కు జూన్ మొదటి వారంలోనూ, అలాగే రబీకి డిసెంబర్‌లో సాగునీరు పుష్కలంగా అందిస్తున్నారు. మండలంలోని ఐదు వేల ఎకరాల దాళ్వా వరికి, ఆరుతడి పంటలైన మొక్కజొన్న 7 వేల ఎకరాలు, జొన్న వెయ్యి ఎకరాలు, వర్జీనియా పొగాకు 2,500 ఎకరాలకు నీరు సమృద్ధిగా అందుతోంది.

సక్రమంగా నీరు



ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రబీలో పంటలకు సాగునీటిని సక్రమంగా అందిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సాగునీరు అందించినా, సక్రమంగా ఉండేది కాదు. వరి ఆకుమడులకు నీరు పెట్టడానికి చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఎటువంటి ఇబ్బందులు లేవు. రబీలో ఆరుతడి పంటలకూ పుష్కలంగా నీరు అందుతోంది.

– గడ్డె వీరన్నబాబు, రైతు, రామచంద్రపురం

సమృద్ధిగా..



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతోంది. రైతులు పంటలను చక్కగా పండించుకుంటున్నారు. నీరు పుష్కలంగా ఉంటే రైతులకు ఆనందమే. రబీలో వేసిన వరి, మొక్కజొన్న, ఇతర పంటలకు నీరు చక్కగా అందుతోంది.

– వలవల వెంకట్రాజు, మండల ఆర్బీకే ఛైర్మన్, సీతానగరం)

నేడు ఘంటసాల జయంతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జ్ఞాన సరస్వతీ పీఠంలోని సరస్వతీ ఘాట్ వేదికపై గోదావరి కల్చరల్ అసోసియేషన్, రాకా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం అమర గాయకుడు, పద్మశ్రీ ఘంటసాల జయంత్యుత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల ప్రతినిధులు తెలిపారు. సమాజ హితం కోరి అనేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలో చైతన్య పరిచిన వేగిశెట్టి కోదండ రామారావు, జీబీ నారాయణ, ఆకుల రామచంద్రరావును సత్కరిస్తామన్నారు. అనంతరం సంగీత విభావరి ఉంటుందన్నారు. రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు.

పన్నులు చెల్లించాలి

రాజమహేంద్రవరం సిటీ: బకాయి పన్నులు, నీటి చార్జీలు, ఖాళీ స్థలాల పన్ను, షాపు అద్దెలను తక్షణమే నగర పాలక సంస్థకు చెల్లించాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ నగరంలో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేయడం జరుగుతోందన్నారు. ఇంకా అనేక ప్రతిపాదనలు వివిధ దశలలో ఉన్నాయన్నారు. ఈ పనుల నిర్వహణకు ప్రధాన ఆదాయ వనరులను వసూలు చేయాల్సి ఉందన్నారు.